క్లుప్తంగా

కబ్జా ఎక్కడ జరిగిందో చూపించాలి



ధర్పల్లి: మండలంలోని రామడుగు గ్రామంలో పేదలకు ఇచ్చిన పట్టా భూమిని కబ్జా చేశారని ఫారెస్టు అధికారులు ఆరోపించడం సరికాదని, అసలు కబ్జా ఎక్కడైందో చూపించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు పట్టాదారులతో కలిసి శుక్రవారం ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ మాలతికి వినతిపత్రం అందజేశారు. పార్టీ రాష్ట్ర నాయకుడు రామకృష్ణ మాట్లాడుతూ సర్వేనం.1150లో ఎస్సీ,ఎస్టీ బీసీలకు చెందిన 250 మంది పేదలకు గతంలో ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందన్నారు. ఆ భూమిలో పంటలు సాగు చేసుకోవడానికి చదును చేస్తుంటే అటవీశాఖ అధికారులు అడ్డుపడుతున్నారన్నారు.రమేష్, దామోదర్, లింబన్న, అనీస్, కిషోర్, రమేష్ పాల్గొన్నారు.

తర్ప డైరెక్టర్ల ఎన్నిక



నిజామాబాద్ నాగారం: శివాజీనగర్ మున్నూరుకాపు సంఘం పరిధిలోని గాండ్ల తర్ప–1 నూతన డైరెక్టర్లను శివాజీనగర్‌లోని తర్ప భవనంలో ఇటీవల ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా శెట్టి రాజేశ్, చిన్న గాండ్ల లింగం, రామర్తి నవీన్, పూదరి సాయిలు, గుండారం దినేశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పెద్దకాపు రామర్తి రాజు, తర్ప క్యాషియర్ భూమయ్య, శంభుని గుడి చైర్మన్ గాండ్ల లింగం, శివాజీనగర్ మున్నూరుకాపు సంఘం మాజీ కార్యదర్శి శెట్టిరాజు, రామర్తి గోపి, గాండ్ల సంతోష్, సిరికొండ నర్సయ్య తదితరులున్నారు.

31న పద్మశాలి వధూవరుల పరిచయ వేదిక



నిజామాబాద్‌నాగారం: నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఈ నెల 31న పద్మశాలి వధూవరుల పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు అఖిల భారత పద్మశాలి సంఘం సెంట్రల్ బోర్డు సభ్యుడు దాసరి నర్సింలు పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. పద్మశాలి కుల బాంధవులందరు తమ కుటుంబంలోని వధువు, వరుడి ఫొటో బయోడెటాను రిజిస్ట్రేషన్ కోసం 9440091895 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. జగదీష్, నారాయణ, వెంకటేష్, రాజేంద్రప్రసాద్, భీమర్తి రవి, బొట్టు వెంకటేశ్, కస్తూరి గంగరాజు, మనోహర్, భూస రవి, లోల రాజు ఉన్నారు.

నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



మోపాల్(నిజామాబాద్‌రూరల్): గ్రామాల్లో నర్సరీల నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వందశాతం విత్తనాలు మొలకెత్తేలా ప్రతిరోజూ నీరు పట్టాలని ఎంపీడీవో లింగం నాయక్ సూచించారు. మండలంలోని కులాస్‌పూర్, చిన్నాపూర్, కంజర్ గ్రామాల్లో శుక్రవారం ఆయన నర్సరీలను పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వేసవి దృష్ట్యా నర్సరీల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చిన్నాపూర్‌లో నీటి సమస్య ఉందని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకురాగా, సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్‌ఏలు, మేట్లు, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి



నిజామాబాద్ రూరల్: మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో శుక్రవారం కాన్షీరాం జయంతి ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కాన్షీరాం విగ్రహానికి బహుజన నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బహుజనులకు రాజ్యాధికారం కోసం కాన్షీరాం ఎంతాగానో కృషి చేశారన్నరు. నాయకులు, అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి శుద్ధిపై ప్రత్యేక దృష్టి

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- నగరంలోని శుద్ధి కేంద్రం పరిశీలన



ఖానాపూర్‌లోని మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

సుభాష్‌నగర్: మురుగునీటి శుద్ధిపై ప్రత్యేక దృష్టిసారించినట్లు నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఖానాపూర్‌లోని మురుగునీరు శుద్ధి కేంద్రం (ఎస్‌టీపీ–1)పనులు ఏడాదిలో పూర్తి చేసి అందుబాటులోకి తెస్తానని పేర్కొన్నారు. నగరశివారులోని ఖానాపూర్ రోడ్‌లోగల భూగర్భ మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని శుక్రవారం ఆయన అధికారులు, కార్పొరేటర్లతో కలిసి సందర్శించారు. యంత్రాల పరిశీలన, మురుగునీటి శుద్ధీకరణ, తదితర పనుల పరిశీలించి, వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. దుబ్బ ప్రాంతంలో ఎస్‌టీపీ–1 31.5 ఎంఎల్‌డీ సామర్థ్యంగల ప్రాజెక్టుకు అమృత్ పథకం–1 ద్వారా రూ.30 కోట్లు, నీటి సరఫరాకు రూ.98కోట్లు కేటాయించి 2017లో ప్రారంభించారని, 2020లో పూర్తయ్యిందని తెలిపారు. అయినప్పటికీ గత ప్రభుత్వం, ఎమ్మెల్యే నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదన్నారు. అమృత్ పథకం–2 ద్వారా యూజీడీకి రూ. 162.81 కోట్లు, వాటర్ సప్లయ్‌కి రూ.217 కోట్లు విడుదల చేశారన్నారు. ప్రస్తుతం ఆ పనులు టెండర్ స్థాయిలో ఉన్నాయని, ప్రభుత్వంతో మాట్లాడి త్వరిత గతిన పూర్తిచేయిస్తానని పేర్కొన్నారు. అధునాతన యంత్రాల ద్వారా మురుగునీటిని శుద్ధి చేస్తారని, ఆ నీటిని వ్యవసాయానికి కూడా వినియోగించుకోవచ్చని తెలిపారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, ఈఈ తిరుపతి, డీఈఈ నగేష్ రెడ్డి, ఏఈ యోగేష్, కార్పొరేటర్లు పంచరెడ్డి ప్రవళిక, ఎర్రం సుధీర్, ఇల్లెందుల మమతా ప్రభాకర్, సవిత రాజు, నాయకులు భాస్కర్, మఠం పవన్, అంతిరెడ్డి హరీష్‌రెడ్డి, ఆనంద్, సాయిరాం, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

నేటి చిత్రం..



వినాయక్‌నగర్‌లోని రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం

వృథాగా రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం

నగరంలోని వినాయక్‌నగర్‌లో భారీ వ్యయంతో నిర్మించిన రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వృథాగా మారింది. ఎమ్మెల్యే కార్యకలాపాల కోసం కొన్నేళ్ల కిందట క్యాంప్ కార్యాలయం నిర్మించారు. కానీ ప్రస్తుత రూరల్ ఎమ్మెల్యే ఉపయోగించకపోవడంతో ఇలా నిరుపయోగంగా మారింది. –సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

రేపు 'భక్తిమాలిక' పుస్తకావిష్కరణ

నిజామాబాద్ సిటీ: ప్రముఖ సైన్స్ పద్యకవి, తంగుడిగె శ్రీనివాస్ రావు రచించిన పద్యఖండిక 'భక్తిమాలిక' పుస్తకావిష్కరణ రేపు జరుగనున్నట్లు పద్య భారతి సాహితీసంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. నగరంలోని 100 ఫీట్ల రోడ్డు శ్రీదత్తాశ్రమాలయం సాయినగర్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని, సాహితీ ప్రియులు అందరూ పాల్గొనాలని సంస్థ సభ్యులు కోరారు.

పశువులకు గాలికుంటు టీకాలు





బోర్గాం(పి)లో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది.. రావుట్ల గ్రామంలో..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరశివారులోని బోర్గాం(పి)లో పశువులకు శుక్రవారం మండల పశువైద్యాధికారి ప్రమోద్ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశువైద్య సిబ్బంది మహేందర్, నరేష్, సుజాత, జోసెఫ్, చిత్రా, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: మండలంలోని రావుట్ల గ్రామంలో ఆవులకు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను శుక్రవారం వైస్ ఎంపీపీ రాజన్న, వీడీసీ చైర్మన్ రమేష్‌గౌడ్, పశు సంవర్ధక శాఖ అధికారి బాబురావు వేశారు. సిబ్బంది శ్రీనివాస్, చంద్రశేఖర్, సతీష్, రంజిత్ పాల్గొన్నారు.



సికింద్రాపూర్ గ్రామంలో..

జక్రాన్‌పల్లి: మండలంలోని సికింద్రాపూర్ గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ కుంచాల విమలరాజు ప్రారంభించారు. మండల పశువైద్యాధికారిణి శిరీషా, గోపాలమిత్ర అశోక్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సిరికొండ: మండలంలోని హుస్సేన్‌నగర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ప్రారంభించారు. అలాగే మండల కేంద్రంలో తాగునీటి సౌకర్యం కోసం కొత్తగా బోరు బావిని తవ్వించారు. నాయకులు బాకారం రవి, మల్లేష్ యాదవ్, గంగారెడ్డి, కుందేళ్ల శ్రీనివాస్, దేవేందర్, సంతోష్, భూమన్న, నారాయణరెడ్డి, మల్లేష్, పోతన్న, ఆసిఫ్, సలాం, మహేష్‌రెడ్డి, శోభన్, దిగంబర్ పాల్గొన్నారు.

మరోసారి కాషాయ జెండా ఎగురవేయాలి

మోపాల్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బూత్ స్థాయి కార్యకర్తలు కీలకంగా వ్యవహరించి నిజామాబాద్ పార్లమెంట్‌లో మరోసారి కాషాయ జెండా ఎగురవేయాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. నగర శివారులోని బోర్గాం(పి)లో గల మోటాటిరెడ్డి కల్యాణ మండపంలో శుక్రవారం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అర్వింద్ మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కులచారి దినేష్, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, వెంకటరమణి, గద్దె భూమన్న, పద్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కవిత అక్రమ అరెస్ట్‌పై పోరాటం చేస్తాం

ఖలీల్‌వాడి/నిజామాబాద్‌అర్బన్/ధర్పల్లి: కేంద్ర ప్రభుత్వం కుట్రలో భాగంగా ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్ట్ చేశారని, దీనిపై న్యాయపరంగా పోరాటం చేస్తామని బీఆర్ఎస్ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ దాదన్నగారి మధుసూదన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. చట్టం అనే ఆయుధం బలమని అదే కవితకు రక్షణ కవచంగా నిలబడి కాపాడుతుందని, చట్ట ప్రకారమే గెలుస్తామని తెలిపారు. అలాగే ధర్పల్లిలో ఎంపీపీ నల్ల సారికహన్మంత్‌రెడ్డి శుక్రవారం మాట్లాడుతూ.. కవిత అరెస్టును ఖండించారు. కవిత వేసిన పిటిషన్ సుప్రీం కోర్టులో విచారణ జరుగుతుండగా అరెస్ట్ చేయడం దారుణమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఎదుర్కోలేకే బీజేపీ ప్రభుత్వం కవితను అక్రమంగా అరెస్ట్ చేయించారని ఆరోపించారు. నాయకులు రాజ్‌పాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

వన్యప్రాణులను సంరక్షిద్దాం



జడ్జికి ఫొటోను బహూకరిస్తున్న సభ్యులు

ఖలీల్‌వాడి: వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిపౌరుడిపై ఉన్నదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. జడ్జి తన ఛాంబర్‌లో శుక్రవారం 'వన్యప్రాణుల సంరక్షణ, పోషణ 'అనే ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతం జలాశయం వద్ద కృష్ణ జింకలు, ఫ్లెమింగ్ బర్డ్స్ లాంటి ఎన్నో అద్భుతమైన పశుపక్షాదులు, వన్యప్రాణులు కనబడే, వలసవచ్చే సమయంలో వాటి జీవనశైలికి హానికరంగా ఉండరాదన్నారు. ఉమ్మడి జిల్లాలోని శ్రీరామ్ సాగర్, పోచారం అభయారణ్యం, మంచిప్ప అటవీప్రాంతంతో పాటుగా ఇతర ప్రాంతాల్లో వన్యప్రాణులను వనంలో సురక్షితంగా ఉండేవిధంగా స్థానిక ప్రజలు సహకరించాలని కోరారు. నిజామాబాద్ ఎన్విరాన్‌మెంట్ వైల్డ్ లైఫ్ సొసైటీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది మంథని రాజేందర్‌రెడ్డి, కార్యదర్శి క్యాతం సంతోష్, కోశాధికారి హితేన్ భాయ్, సభ్యులు దర్శన్‌సింగ్ సోకి, కట్కం శ్రీనివాస్ పాల్గొన్నారు.

'మరో రకం విత్తనం అంటగట్టారు'



కోటగిరిలో ఆందోళన చేస్తున్న రైతులు

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని గ్రోమోర్ కార్యాలయం వద్ద శుక్రవారం రైతులు ఆందోళన చేపట్టారు. గంగా కావేరి పేరు చెప్పి మరో రకం విత్తనం అంటగట్టారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 రోజుల్లో చేతికి రావాల్సి ఉండగా ఇప్పటి వరకు పొట్ట దశకు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గ్రోమోర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేదని వాపోయారు. తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ రావు దృష్టికి తీసుకెళ్లగా.. సమస్యపై విచారణ చేశామని, గంగాకావేరి స్వల్పకాలిక రకం విత్తనం ఇవ్వాల్సి ఉండగా దీర్ఘకాలిక రకం రైతులకు వచ్చిందని అన్నారు. కంపెనీ యాజమాన్యంతో చర్చించి రైతులకు నష్టం జరుగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రత్యేక పాలనలోనూ అంతేనా!

- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
- వసతుల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం
- ఇబ్బందుల్లో ప్రజలు



గుండారంలో ఎండిపోయిన మొక్కలు



బర్దిపూర్ గ్రామంలో అధ్వానంగా డ్రెయినేజీ

నిజామాబాద్ రూరల్: గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీకాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం గత నెల నుంచి స్పెషల్ ఆఫీసర్లతో పాలనను ప్రారంభించింది. అయినా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు మాత్రం తీరడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పారిశుధ్యం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. చెత్తను నిత్యం సేకరించాల్సిన పంచాయతీ కార్మికులు పర్యవేక్షణ లేకపోవడంతో నాలుగుఐదు రోజులకు ఒక్కసారి చెత్తను సేకరిస్తున్నారు. ఇటీవల గ్రామాల్లో స్వచ్ఛతా వారోత్సవాలు నిర్వహించినప్పటికీ ఎక్కడి చెత్త అక్కడే ఉన్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

ఇదీ పరిస్థితి..

గ్రామాల్లో ముఖ్యంగా ప్రజలకు కావలసిన మౌలిక వసతుల కల్పన, మంచినీరు, డ్రెయినేజీల శుభ్రత, చెత్తను సేకరించడం వంటి పనులపై ప్రత్యేక అధికారులు దృష్టిసారించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. గ్రామాలకు కేటాయించిన స్పెషల్ అధికారులు మొదటగా తాము పని చేస్తున్న ప్రదేశాల్లో వృత్తికి ప్రాధాన్యతను ఇస్తు అనంతరం ఇన్‌చార్జి గ్రామాలకు రెండు, మూడు రోజులకు ఒకసారి వస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ కొంత మందికి గ్రామ స్పెషల్ అధికారి ఎవరో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు స్పందించి మంచినీటి కొరత లేకుండా చూడాలని, మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

ప్రత్యేక అధికారి ఎవరో తెలియదు



అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం పనులు కుంటుపడ్డాయి. గ్రామాల్లో ఉన్న వ్యక్తులకు ప్రత్యేక అధికారి ఎవరో కూడా తెలియని దుస్థితి నెలకొంది. అధికారులు ముందుకు వచ్చి గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి. –భగవాన్, బర్దిపూర్ గ్రామం

అధ్వానంగా డ్రెయినేజీలు..



సర్పంచులు ఉన్నప్పుడు కూడా పారిశుద్ధ్యం సమస్యలు ఉండేవి. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలనలో కూడా అదే తీరు కొనసాగుతుంది. డ్రెయినేజీలు శుభ్రం చేయకపోవడంతో అధ్వానంగా మారాయి. అధికారులు స్పందించి, సమస్యలు పరిష్కరించాలి. –బట్ల రాజేశ్వర్, ధర్మారం

సమస్యలు పరిష్కరిస్తాం..

జిల్లాలోని గ్రామాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. ఆయా గ్రామాల పంచాయతీ ఖాతాల్లో జమ అవుతున్నాయి. గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం రూరల్ నియోజకవర్గంలో రూ.కోటి నిధులు మంజూరు అయ్యాయి. సమస్యలను స్థానిక ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తాం. –తరుణ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఖలీల్‌వాడి: నగరంలోని జిల్లా కాంగ్రెస్ భవన్‌లో శుక్రవారం ఆర్మూర్ కాంగ్రెస్ నేతలు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు వారు హర్షం వ్యక్తం చేశారు. కాలగడ్డ శ్రీకాంత్, పీరాజి నాగరాజు, రాజు నాయక్, గోపి నాయకులు కిరణ్, పవన్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

కొనసాగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు





నిజామాబాద్ రూరల్: మండలంలోని అశోక్‌ఫారంలో గల వైభవ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. శనివారం రథోత్సవం, ఆదివారం చక్ర తీర్థంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	66,300	వెండి (కిలో)	77,500
22 క్యారెట్స్	61,142		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు (రూ.)


	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	45	60
బెండకాయ	50	70	పచ్చిమిర్చి	40	70
బీరకాయ	40	60	దోసకాయ	25	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	30	60	గోబిగడ్డ	30	50
కాకరకాయ	50	70	గోబిపువ్వు	50	70
వంకాయ	40	60	బీట్‌రూట్	20	40
పాలకూర	20	40	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	35	60	చిక్కుడుకాయ	30	50
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సింగ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్




ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ప్రేమలు (తెలుగు) - 1.30, 7.30, పరతులు వర్తిస్తాయి - 4.40, లంబసింగి (తెలుగు) - 10.30
స్క్రీన్-2	రజాకార్ (తెలుగు) - 10.40, యోధ (హిందీ) - 1.40, గామి (తెలుగు) - 4.30, 10.40, భీమా (తెలుగు) 7.40
స్క్రీన్-3	రజాకార్ (తెలుగు) - 1.35, 7.20, యోధ (హిందీ) - 4.35, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	యోధ (హిందీ) - 10.10, 1.10, 7.10, 10.10, పరతులు వర్తిసాయి - 4.10
స్క్రీన్-2	ప్రేమలు - 4.45, రజాకార్(తెలుగు) - 10.20
స్క్రీన్-3	గామి (తెలుగు) - 12.25, 7.20 సైతాన్ (హిందీ) - 1.35 లంబసింగి (తెలుగు) - 4.35, బస్తర్ (ది నక్సల్ కథ) 10.30
స్క్రీన్-4	తంత్ర (తెలుగు) - 10.30 బస్తర్ (ది నక్సల్ కథ) 1.25, భీమా (తెలుగు) 4.15, సైతాన్ (హిందీ) - 7.20, 10.30
దేవి	ప్రేమలు (తెలుగు)
నటరాజ్	తంత్ర (హిందీ)
లలితామహల్	భీమా (తెలుగు)
విజయ్	రజాకార్ (తెలుగు)

సెమీస్ చేరిన జిల్లా జట్టు



నిజామాబాద్‌నాగారం: ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో కొనసాగుతున్న రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ బాలికల పోటీలలో జిల్లా జట్టు సెమీఫైనల్స్‌కు చేరింది. క్వార్టర్ ఫైనల్ లో మెదక్ జట్టుపై 11–0 తేడాతో నిజామాబాద్ జిల్లా జట్టు గెలుపొందినట్లు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగ మోహన్ శుక్రవారం తెలిపారు. జట్లకు కోచ్ మేనేజర్లుగా మర్కంటి గంగా మోహన్, నరేష్, మౌనిక వ్యవహరిస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

డిచ్‌పల్లి: రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మిట్టాపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని చెల్మిటి అమూల్య ఎంపికైనట్లు హెచ్‌ఎం సుశీల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా అమూల్యను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు మర్కంటి గంగామోహన్ అభినందించారు.